# ట్రిబుల్ ప్రమోషన్



చచ్చీ చెడీ ఎలాగోలా వేసం కాలం సెలవులయ్యాయని పించాం. కొన్నాళ్లు అమ్మమ్మ వాళ్లింటో కొవ్వూరులోనూ, కాకినాడ తాత గారింట్లోనూ తిరిగి తిరిగి వచ్చాం కదా. అన్నిటికన్నా మా ఇల్లే హాయిగా వుందనిపించింది. మేం లేవని సువర్ణ చాలా దిగులు పడిందిట. సెలవలకి ముందురోజే అందరికీ ప్రోగ్రెసు కార్డులిచ్చేశారు కదా. రేపట్నించి బడికెళ్లాలి. ఇంతింత కాలం బడికెళ్లకుండా వుంటే ఎంత విసుగొచ్చేసిందో.

సెలవల్లో చిన్నారికీ నాకూ రోజూ ఏదో ఓ దాని కోసం యుద్ధవే. నేను కాస్లు ఫస్టు వచ్చానని అయిదో క్లాసు చదవక్కర లేకుండా ఫస్టుఫారంలోకి డబుల్ప్రమెషన్ ఇచ్చేశారూ... చిన్నారిసెకండొచ్చింది కాబట్టి అది నోరెత్తకుండా మూడో క్లాసు చదవాల్సిందే. సువర్ణేమో సెకండు ఫారంలోకొచ్చింది. చిన్నారి సెకండు రాంకొస్తే అందులో నా తప్పేవుంది? ఈ సెలవలన్నాళ్లు కుళ్లుకు చావడవే కాకుండా ఇంక తెల్లారి బడనగా నేనా వెధవ బళ్లో చదవనే చదవనూ అని ఒకటే ఏడుపు. పొద్దున్నే దాని

గోల చూసి నాన్న "పోనీలే నీకు చదవాలని లేకపోతే చదువుమానేయ్. రెండో క్లాసు పాసయ్యావుగా చాల్లే" అని ఆఫీసుకెళ్లిపోయారు. దీని ఏడుపు విని ఇల్లుగల అత్తయ్యగారొచ్చారు ఏవిటవుతోందో అనుకుని.

"వదినగారూ! ఆ స్కూల్లో పిల్లేదో జడుసుకున్నట్లుంది పోనీ స్కూలు మార్చకూడదూ" అన్నారు.

"ఇది అందర్నీ జడిపిస్తుంది గానీ తను జడుసుకునే రకం కాదే. దీని విషయం మీకు తెలియదు. ఏదో ప్లానుండే వుంటుంది దాని బుర్రలో ! సుశీలకి డబుల్ ప్రమోషనొచ్చి మరి దీనికి రాలేదు కదా. ఇప్పుడు మూడు క్లాసులు తక్కువ చదవడం దానికి నామోషట. ఇంక అందుకని ఆ స్కూలుకి చచ్చినా వెళ్లదుట. ఏవన్నా అర్థవుందా ! ఈ ఏడాది ఫస్టొస్తే దీనికీ ఇస్తారుగా డబుల్ ప్రమోషన్" అని అంది అమ్మ.

"అమ్మా! నీపెద్దకూతురు కొట్టేపోజులు భరిస్తూ అసలు నేను ఏడాదంతా బతికి చదివి పాసయినప్పుడు కదా ఫస్టురాంకు సంగతి ! నేమాత్రం చచ్చినా దానితో కలిసి ఆ బడికి వెళ్లను. రేపు నువ్వు సువర్ణా వాళ్ల గుమాస్తాగారితో ఫీజు కట్టించేసినా నే వెళ్లను నీ ఇష్టం" అని చిన్నారి ఖచ్చితంగా చెప్పేసింది.

అమ్మయితే తలపట్టుకుకూచుంది. ఎప్పుడూ చేతిలో ఏదో ఓ పుస్తకంలేకుండా వుండని చిన్నారి అసలు చదువే మానేస్తానంటే మరి అమ్మకి భయం వేయదూ ! ఇంతలోకీ వెంకాయమ్మ గారొచ్చారు. "పోనీ మా మనవడు ఈ వీధి చివర ఈదర వెంకట్రావయ్య గారి బళ్లో చదువు తున్నాడు. అక్కడ చేర్పించమ్మా ప్రస్తుతానికి. కాస్త పిల్లదానికి తిక్కతగ్గాక మళ్లీ కాన్వెంటులో పడేయచ్చు" అని వుపాయం చెప్పారు.

"ఏవే ! ఆ బడికెడతావా?" అనడగింది అమ్మ.

రేపోసారి చూసొస్తా! నాలుగులో చేర్చుకుంటానంటే చేరతానని - ఒప్పుకుంది. ఇంక అక్కడితో ఆ గొడవయిపోయిందని అమ్మయ్య అనుకుంది అమ్మ.

మర్నాడు నేనూ సువర్ణా వెడుతూ 'రావే ! వీళ్ల కొత్త కారులో వెడదాం' అన్నా కూడా వినిపించుకోలా. వేసవికాలం సెలవుల్లో సువర్ణా వాళ్లు మంచి నల్లకారు కొనుక్కున్నారు. నడిపేందుకు ఓ డ్రైవరు తాతగారిని పెట్టుకున్నారు. దానికి కారెక్కి స్కూలుకెళ్లాలని రాసిపెట్టుండాలి కదా! ఏవరేం చేస్తాం. నేవెళ్లి క్లాసులో కూచుంటే అందరు పిల్లలు నా కన్నా ఎత్తుగా అనిపించారు. మా ఫ్రెండ్సంతా అయిదో క్లాసులో వుండిపోయారు కదా! తెల్సిన వాళ్లెవరూ లేరు. దానికి తోడు ఫస్టుఫారంలో ఎక్కడెక్కడి కొత్త పిల్లలో ముందు పరీక్ష రాసి పాసయి జేరతారు. అందుకే ఫస్టుఫారం నుంచి నాలుగు సెక్షన్లుంటాయి. నాకు బొత్తిగా తోచక కాసేపు

అయిదో క్లాసులో కూచుని మళ్లీ వచ్చా. ఎందుకొచ్చిన డబుల్ ప్రమోషనూ ! ఇంట్లోనా చిన్నారి తోటే విరోధం వచ్చేసింది. స్కూల్లో అయితే ఒక్క పిల్ల మొఖమూ తెలిసినట్లు లేదు.

మొదటిరోజు కదాని అందర్నీ అన్నాల బెల్లు కొట్టగానే ఇంటికెళ్లి పొమ్మన్నారు. ఇంతలోకీ మా పాత రిక్షావాడు కనిపించి ఇంటి దగ్గిర దింపేశాడు. 'అమ్మాయి గారూ తవరు కారు కొనుక్కున్నారేటండీ' అని అడిగాడు. సువర్ణం మాట్లాడలేదు గానీ నేను మాత్రం "అవును! బడి కెళ్లడానికి వీలుగా వుంటుందనీ" అని చెప్పా. అప్పుడప్పుడు నా రిచ్చాలో కూడా ఎలిపోయెచ్చాల అంటే అలాగేలే అని వాడికి చెప్పి ఇంట్లోకొచ్చా.

చూస్తే ఏవుంది. చిన్నారికి చదువా ! చట్టుబండలా! ఇందునీ బుజ్జినీ ముందేసుకుని కేరమ్సాడుతోంది. అయ్యో చదువు మానేశానే అని గానీ, కారెక్కలేకపోయానే అని గానీ దానికింత బాధ కూడా వున్నట్లు అనిపించలా. తలెత్తి కూడా నాకేసి చూడలా. నన్ను చూడగానే ఏదో పనున్నదానిలా లేచి వెళ్లిపోయి ఓ పాత బాలమిత్ర పుచ్చుకుని కూచుంది.

అన్నం తింటూ అమ్మతో చెప్పా "అమ్మా ఫస్టుఫారం అంటే అంత పెద్ద క్లాసని నా కు ఇన్నాళ్లు తెలియనే తెలియదమ్మా. ఇది వరకు మాకు నేల మీదే కూచుని చేతి బల్లల మీద రాసుకోవాల్సి వచ్చేది కదా. ఇపుడు ఎవరి బెంచీ వాళ్లకే! ఎవరి కుర్చీ వాళ్లకే. కుర్చీ బల్ల కలిసి వుంటాయి. పది పుస్తకాలు పెట్టుకునేంత డ్రాయరు కూడా వుంది. ఇంకొలికి పోకుండా ఇంకు సీసా నిలబడేందుకు ప్రతి బల్ల మీదా గుండ్రంగా బిళ్లలాగా కూడా వుంది తెలుసా" అని అమ్మకి నేను మా స్కూల్లో ఫస్టుఫారం క్లాసు కబుర్లు చెప్తున్నాను. ఏదన్నా చెప్తేనే కదా తెలిసేది! అమ్మసలు బడికే రాదు కదా. ఏవీ చెప్పక పోతే ఎంత కని వూహించుకుంటుందీ!

చిన్నారి పాపం తలెత్తకుండా విననట్లుగా నటిస్తోంది. దాన్ని చూస్తే నాకే జాలేసింది. ఎంతయినా సొంత చెల్లెలు కదా. రెండో క్లాసుతో చదువాపేస్తోందంటే నాకు మాత్రం బాధగా వుండదూ? నాకన్నా మూడు కాస్లులు తక్కువయి పోయాననే కదా ఏకంగా బళ్లోకే వెళ్లనని పంతం పట్టేంది. ఫస్టురానంత మాత్రాన మరీ ఇంత పనిమ్మెంటా?

"అమ్మా వారం రోజులలోపు ఫీజు కట్టకపోతే పేరు కొట్టేస్తారుట. ఈ శనివారం లోపల దీని తిక్క తగ్గకపోతే ఆ మూడో కాస్లు చదువు కూడా వుండదు" అన్నా.

"నానీ! నీ విషయం నువ్వు చూసుకో! దాని చదువు సంగతి నీకెందుకు? మళ్ళీ ఏవన్నా అంటే రోజున్నర ఏడుస్తావు. నువ్వేమయినా దాని గార్డియ నువా?" అని ఇలాటి పరిస్థితులలో కూడా నన్నే కేకలేసింది. అమ్మెప్పుడూ దాని పక్షమే. అమ్మంతా వూరికే పనున్నప్పుడే నాతో బాగా మాట్లాడుతుంది.

'నేను నీ చెత్త బళ్లో చేరనని ఎప్పుడో చెప్పేశాగా! చెప్పమ్మా అమ్మా. నేను కొత్త బళ్లో

చేరానని!''

''ఏవిటి! కొత్త బళ్లోనా! ఏ బడి? చెప్పవేమే అమ్మా? దాన్ని ఎంచక్కా కొత్త బళ్లో చేర్పించి నన్నా వెధవ పాత బళ్లోనే చదివిస్తున్నావా? ఎంత న్యాయం!''

''ఛ నోర్ముయ్. తేగంటే తేగలాటి కొడుకు కావాలంటావు! కొత్త బడంటే కొత్త బట్టలనుకుంటున్నావా? రోజు రోజుకీ కావాలనడానికి. దానికంటే బుద్ధిలేదు. పెద్దదానివి నీ బుద్ధి ఏమవుతోంది?'' మళ్లీ నన్నే తిట్టడం.

''అమ్మా! చెప్పమ్మా! ఏ బళ్లో చేరిందో?''

''మన వెంకాయమ్మగారి మనవడు చదువుతున్నాడే వీధి చివర బడి. అందులో రెండు రూపాయలు జీతం కట్టి వచ్చింది'' అమ్మ చెప్పింది.

''ఛీ ఛీ ఛీ! వీధి బళ్లో చేరావా నా తల్లీ! ఇంకా కొత్త బడంటే ఏవిటో అనుకున్నాను. వీళ్లన్నా నిన్ను నాలుగో క్లాసులో చేర్చుకున్నారా పాపం ఇంతా కష్టపడ్డావు''!

''లేదు! అలా కుదరదన్నారు''

''అయ్యో పాపం. స్కూలు మారీ ఏంలాభం. నాలుగులో చేర్చుకోపోతే!''

''నీకెందుకే నా బాధ-నాలుగు కాకపోతే అయిదులో చేరా! నీకెందుకూ నావూసు!''

''అమ్మ బాబోయ్! అయిదో క్లాసా! ఏకంగా మూడూ లేదు నాలుగూ లేదూ! అయిదో క్లాసా! నాకన్నా ఒక్క క్లాసే తక్కువా?'' నాకయితే గుండాగినంత పనయింది.

'' ఆ! నీకన్నా ఒక్క క్లాసే తక్కువ. నువ్వుగాని ఎప్పుడన్నా ఒక్కసారి పరీక్ష తప్పితే నీక్లాస్‌మేటునయిపోతా. చూస్తుండు. మళ్లీ ఏడు కాన్వెంట్లో ఫస్టుఫారంలో చేరే పిల్లల కోసం పరీక్ష పెడతారు కదా! అందులో పాసయి కాన్వెంట్లో వచ్చే ఏడు చేరక పోతే నా పేరు చిన్నారే కాదు!'' ఇదన్నంతా పనిచేస్తుందని నాకు తెలుసు.

నే ఇందాకట్నించీ దాని చేతిలో వున్నది బాలమిత్ర అనుకున్నా. కాదు సువర్ణవాళ్ల తమ్ముడు సాయి లేడూ! అతన్ది మూడో క్లాసు భూగోళం పుస్తకం. ఒకపది రోజుల్లో మూడో క్లాసు పుస్తకాలు, ఇంకో పదిరోజుల్లో నాలుగో క్లాసు పుస్తకాలు (నావిపాతవి) చదివేస్తుందిట. వెధవ ఒక్కో క్లాసు చదవడానికి ఏడాదెందుకూ! దండగ! అని టక్కులు పోయింది.

నిజంగానే అది అన్నమాట సాధించి మళ్లీ ఏడాది మా కాన్వెంటు లోనే ఫస్టుఫారంలో చేరి ప్రతి పరీక్షల ముందరా నేతప్పితే నా క్లాసుమేటవుతానని బెదిరిస్తుంటే అసలు నేననే మనిషినుంటానా! ఏదన్నా భరించచ్చుగానీ అది నా క్లాసులో నాపక్కనో ముందో కూచుంటే బతగ్గలనా! లాభంలేదు. ఇంక నేను చచ్చినట్లు వళ్ళు దగ్గిరెట్టుకు చదవాల్సిందే!!